## క్లుప్తంగా

### వేతనాలు చెల్లించాలి

**ఆదోని రూరల్ :** ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు జి.రంగనాథ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లించాలని ఈనెల 7వ తేదీన ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమం చేపడతామని తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రెండు నెలలుగా కూలీల వేతనాలు అందడం లేదని, వెంటనే వేతనాలు చెల్లించి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పనిదినాలు 200 రోజులకు పెంచాలని, వేతనం రూ.600 ప్రకారం ఇవ్వాలనికోరారు. ధర్నాలో కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ఘనంగా గ్యార తారీఖ్ వేడుకలు



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

**కౌతాళం:** స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గ్యారతారీఖ్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో పాల్గొనడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావచ్చారు. దీంతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో దర్గాలోని మజ్జీద్‌లోనే ప్రత్యేక నమాజు ఆచరించుకున్నారు. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి అనుమతించారు. సాయంత్రం చదివింపులు, నాతేషరీఫ్‌లు, సలాముల ఆలపన చేశారు.

### 9 నుంచి పాదయాత్ర భక్తులకు అన్నదానం

**ఆదోని అర్బన్ :** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదోని మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే శివభక్తులకు ఈనెల 9వ తేదీ నుంచి అన్నదానం నిర్వహిస్తున్నట్లు అల్కూరు మఠం మహర్షి విజయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరు రోడ్డులోని మహీంద్రా ట్రాక్టర్ షోరూం సమీపంలో తొమ్మిదేళ్ల నుంచి దాతల సహకారంతో పాదయాత్రగా వెళ్లే శివ భక్తులకు అన్నదానం చేస్తున్నామని, ఈ నెల 13వ తేదీ వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

### బహుమతుల ప్రదానం



బహుమతి అందజేస్తున్న దృశ్యం

**ఆదోని అర్బన్ :** శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆధ్యాత్మిక కేంద్రం 19వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు, మేధావులకు జనరల్‌నాలెడ్జ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకులు రాచోటిసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, ఆర్‌ఎంజీరెడ్డి, గట్టు మురళీకుమార్, నాగమణి, నరసయ్య, వెంకటలక్ష్మి, శ్రీనివాస్, తెలుగు పండిట్ సుస్వరం నాగరాజు చేతుల మీదుగా శుక్రవారం బహుమతులు అందజేశారు. అలాగే కేంద్రంలో ఉచితంగా కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

### 20 తులాల బంగారం చోరీ

**ఎమ్మిగనూరురూరల్:** పట్టణంలోని ఎస్‌ఎంటీ కాలనీ చివర చెరువు సమీపంలో ఉపాధ్యాయుడు షేక్ మహబుబ్‌బాషా ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. వివరాలు.. మహబుబ్‌బాషా కారుమంచి జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్నాడు. భార్య నసీమాబాను పట్టణంలో వీవర్స్ కాలనీ జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తోంది. శుక్రవారం ఇద్దరు విధులకు వెళ్లగా కుమారుడు సోహెల్ ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను తెరిచి 20 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఇంట్లోని ఇతర వస్తువులను ముట్టుకోలేదు. సాయంత్రం ఇంటికి వచ్చిన సోహెల్ తలుపులు తెరిచి ఉంటంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని తల్లి దండ్రులకు సమాచారం అందించాడు. బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇంటి వద్దకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### జాబ్‌మేళాకు విశేష స్పందన



ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

**పత్తికొండ రూరల్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్, అపార్డ్ ఎన్జీఓ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. దాదాపు 300 మంది నిరుద్యోగులు మేళాలో పాల్గొన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ సురేంద్రనాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామిరెడ్డి, రేఖరెడ్డి, అపార్డ్ కర్నూలు సీఈఓ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ మాధురి పాల్గొన్నారు.

# రూ.450కే విద్యుత్ కనెక్షన్

పేదల సొంతింటి కల నెరవేర్చడంలో నెలకొన్న అడ్డంకులు, ఇబ్బందులను ప్రభుత్వం తొలగిస్తోంది. ఇందులో భాగంగా టిడ్కో పరిధిలోని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ పొందడానికి లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదని రూ.450కే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు సైతం వెలువరించింది. దీంతో సామాన్యులకు విద్యుత్ కనెక్షన్ పొందడం భారంగా మారదు. సర్కారు నిర్ణయంపై అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- టిడ్కో లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్హులు



అత్యాధునిక వసతులతో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయం

**ఆదోని టౌన్ :** పేదల సొంతింటి కల సాకారంలో ప్రభుత్వం అడుగడునా అండగా నిలుస్తోంది. ఇప్పటికే ఆధునికంగా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్లను అర్హులకు కేటాయించారు. త్వరలో వారికి స్వాధీనం చేయనున్నందున విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఇందుకు కనెక్షన్‌కు అయ్యే ఖర్చును పేదలు చెల్లించుకోలేరని రూ.450కే కనెక్షన్ ఇచ్చేలా చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో సాధారణ ఇంటికి విద్యుత్ కనెక్షన్ పొందాలంటే రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చయ్యేది. వారి ఆర్థిక స్థోమతను దృష్టిలో ఉంచుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేవలం నామమాత్రపు రుసుముతో కనెక్షన్ ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదోని మున్సిపాలిటీలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన 2 వేల ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆ ఇళ్లకు రూ.450కే విద్యుత్ కనెక్షన్ అందిస్తోంది. 365 చదరపు అడుగుల ఇళ్లు 160, 430 చదరపు అడుగుల ఇళ్లు 352 పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. టిడ్కో సముదాయంలో కరెంట్, తాగునీటి వసతి, రోడ్లు, కాలువలు, గుడి, బడితో పాటు ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమంటున్నారు.

**కనెక్షన్‌కు ఇలా దరఖాస్తు చేసుకోవాలి..**

టిడ్కో ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కోసం లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఇంటి రిజిస్ట్రేషన్ పత్రం తప్పనిసరి. కనెక్షన్ కోసం సెక్యూరిటీ డిపాజిట్ రూ.400 చెల్లించాలి. వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలి.

**సీఎం నిర్ణయం బాగుంది**



టిడ్కో ఇళ్లకు రూ.450కే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయం బాగుంది. ఆ నిర్ణయంతో వేలాదిమంది పేదలకు ఆర్థిక ఇక్కట్లు తప్పనున్నాయి. మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుండటం హర్షనీయం.

– పి.లక్ష్మి, కార్వన్‌పేట, ఆదోని

**ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం**



టిడ్కో ఇళ్లకు రూ.450కే విద్యుత్ కనెక్షన్ ఇస్తామని ప్రకటించడం అభినందనీయం. అలాగే సముదాయాల్లో చేపడుతున్న వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలి. పేదలకు అండగా నిలిచినందుకు జగనన్నకు కృతజ్ఞతలు

– జమున, శక్తిగుడి ఏరియా, ఆదోని

**వారంలోగా నీటి సమస్య పరిష్కారం**

టిడ్కో ఇళ్ల సముదాయంలో లబ్ధిదారులకు అనుగుణంగా వసతులు కల్పిస్తున్నాం. వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో నీటి సమస్యకు పరిష్కారం చూపుతాం. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి టిడ్కో ఇళ్ల వరకు తాగునీటి పైపులైన్‌ల నిర్మాణం పూర్తి చేశాం. పైపులైన్ల చెకప్ కోసం రెండు, మూడు రోజులు పడుతుంది. నీటి సమస్య రానివ్వం.

– రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

### వాహనాల వేలం



వాహనాల వేలం పాటలో పాల్గొన్న పాటదారులు

**ఆదోని అర్బన్ :** స్థానిక సెబ్ స్టేషన్‌లో శుక్రవారం నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో 103 వాహనాలను పాటదారులు దక్కించుకున్నారని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. మొత్తం 117 వాహనాలకు వేలం నిర్వహించగా, 103 వాహనాలను కొనుగోలు చేశారన్నారు. వాటిని రూ.11,51,500 కొనుగోలు చేశారని, 150.42 శాతం అదనంగా ఆదాయం రాగా జీఎస్టీ రూపంలో మరో రూ.2,07,270 వచ్చిందని చెప్పారు.

### బలమైన నాయకత్వంతోనే అభివృద్ధి

**ఆదోని అర్బన్ :** ఏదైనా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే బలమైన నాయకత్వం అవసరమని, అందుకు ప్రజాస్వామ్యంలో అనుక్షణం ప్రజల కోసం పరితపించే వారిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ మాజీ రాజ్యసభ సభ్యుడు టి.జి.వెంకటేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం పూర్తిగా వెనకబడి ఉందని, ఈ ప్రాంత అభివృద్ధికి బీజేపీ ప్రత్యేక డిక్లరేషన్ చేసిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు చిరంజీవిరెడ్డి, చంద్రమౌళి, విట్టా రమేష్, పార్థసారథి, రామస్వామి, నరసింహ, ప్రకాష్‌జైన్, మలేకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఇంటింటికీ కుళాయి కనెక్షన్

**ఆదోని రూరల్ :** ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు జయమనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.42 లక్షలతో సంపు నిర్మాణ పనులకు పార్టీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చిలుక శంకరమ్మతో కలిసి భూమిపూజ చేశారు. జయమనోజ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం రూ.2.88 కోట్లతో సుమారు 10 కి.మీ. బీటీ రోడ్డు వేయించామని చెప్పారు. అలాగే గ్రామంలో విలేజ్ క్లినిక్, ఆర్బీకే నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, రూ.12 లక్షలతో సీసీ రోడ్లు వేయించామన్నారు. గ్రామంలో రాకపోకలకు ఇబ్బంది ఉండడం తో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయించామని, గ్రామంలో నూతనంగా రూ.26 లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. త్వరలో గ్రామానికి తాగునీటి ఎద్దడి అనేది లేకుండా చర్యలు చేపడగామని స్పష్టం చేశారు.



భూమిపూజలో పాల్గొన్న జయమనోజ్‌రెడ్డి, నాయకులు



ఉత్సవ మూర్తులకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

### వైభవంగా తెప్పోత్సవం

**మద్దికెర:** మండల కేంద్రంలో వెలసిన ఆంజనేయ స్వామి, శ్రీకృష్ణ స్వామి ఉత్సవమూర్తులకు శుక్రవారం స్థానిక మద్దమ్మ బావిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిందెసేవ, అష్టోత్తర నామార్చన, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను తెప్పపై ఉంచి బావిలో తెప్పోత్సవం చేశారు. భక్తులు కనులారా వీక్షించి పులకించిపోయారు.

## కమనీయం.. కల్యాణోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

**ఆలూరు:** దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ ఫారెస్ట్‌లో కొలువుదీరిన కొలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి దంపతులు, తువ్వదొడ్డి ప్రేమనాథ్‌రెడ్డి దంపతులు ఉభయదారులుగా స్వామి అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. అర్చకులు మురళి, విద్యాధర్ వేద మంత్రోచ్చరణతో కల్యాణోత్సవం నిర్వహించారు. ఈఓ బి.చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉతవమూర్తులకు గరుడ వాహన సేవ, లక్ష్మినారాయణ, నవగ్రహ హోమాలు అనంతరం శేషవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. పత్తికొండ సీఐ రామకృష్ణారెడ్డి, దేవనకొండ ఎస్‌ఐ భూపాలుడు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి మాట్లాడుతూ శనివారం రథ కలశ స్థాపన, 5న రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

## అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు

**కోసిగి:** వ్యవసాయ భూములను రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్లుగా మార్చి ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని డి.బెళగల్, నేలకోసిగి, కోసిగి గ్రామాల్లో లేఅవుట్లను తహసీల్దార్ రుద్రగౌడతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోసిగి మండలంలో సర్వే నంబర్ 144, 352, 356,357లో 15ఎకరాలు, నేలకోసిగిలో సర్వే నంబర్ 108లో 3.47 ఎకరాలు, 156లో 2.40 ఎకరాలు, 18 సర్వే నంబర్‌లో 2.90 ఎకరాల్లో లే అవుట్ వేశారన్నారు. కుడా, రెవెన్యూ అధికాలు విచారణ చేసి సబ్ రిజిస్ట్రేషన్ వాల్యువేషన్ ప్రకారం 5శాతం లేఅవుట్ పన్నుతో పాటు ఆదనంగా 5శాతం పన్ను, ఇప్పటి వరకు రూ.10లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. పెనాల్టీ ఫీజు చెల్లించిన తర్వాత అనుమతులు ఇస్తామని స్పష్టం చేశారు. ఆర్‌ఐ తిక్కస్వామి, సర్వేయర్ బసవరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.



నేలకోసిగిలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ కలెక్టర్ అభిషేక్ కుమార్

**అధికారులు బాధ్యతగా పనిచేయాలి**

**కౌతాళం:** అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఏరిగేరి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, బీఎల్‌ఓలు ఈ పనిని సమర్థవంతగా పూర్తి చేయాలని గ్రామ వీఆర్‌ఓ ఇందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మండలంలో ఏరిగేరి ఓటరు నమోదులో వెనబడి ఉందన్నారు. హౌసింగ్ బిల్లుల విషయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ అలసత్యం వీడాలని చెప్పారు. లబ్ధిదారులకు బిల్లులు రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతుంటే కిందస్థాయి అధికారులు సక్రమంగా పని చేయకపోతే వారికి బిల్లులు అందవని, లబ్ధిదారుల నుంచి ఎలాంటి వసూళ్లకు పాల్పడకుండా బిల్లులు వచ్చేల చూడాలని ఆదేశించారు. ఇకనుంచి పద్ధతి మార్చుకుని పనిచేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్, వీఆర్‌ఓలను మందలించారు. అనంతరం ఆయన ఉరుకుంద, హాల్వి గ్రామాల్లో పర్యటించారు.తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ తహసీల్దారు పెద్దయ్య, ఆర్‌ఐ రాజశేఖర్, కార్యదర్శి యోగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్

**హొళగుంద:** కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం ప్యాకెట్లను తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప తాలూకా అలబునూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. నరసింహ, రేవన్న అనే వ్యక్తులు బైక్‌పై మూడు బాక్సుల్లో 288 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా హెబ్బటం గ్రామ శివారులోని మఠం వద్ద పట్టుబడినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సెబ్ పోలీసులకు అప్పగించామన్నారు. అలాగే బైక్‌ను కూడా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

**నందవరం:** అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన్నట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. కనకవీడు గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన లక్ష్మికాంత రెడ్డి ఇంట్లో ఒరిజనల్ ఛాయస్ డీలెక్స్ విస్కీ 75 ట్రెటా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### విశ్వనాథ్ మృతి బాధాకరం

**ఆదోని అర్బన్ :** సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ మృతి బాధాకరమని కళాకారులు రాముడు, మునిస్వామి, దస్తగిరి, నల్లారెడ్డి, షేక్షావలి, రవికుమార్, చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కళావేదిక, లలితకళాసేవ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమ ఖ్యాతిని చాటడంలో ఆయన సేవలను కొనియాడారు. కళాకారులు వెంకటేష్, లక్ష్మన్న, అబ్దుల్లా, మహానంది పాల్గొన్నారు.



విశ్వనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

## ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠ



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న చిన్నారులు

**హొళగుంద:** మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో శుక్రవారం తిమ్మప్ప (వేంకటేశ్వర స్వామి) ఆలయ నూతన గోపుర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. అంతకుముందు పంచ కలశాలను గ్రామంలో బీరప్ప డోళ్ల మధ్య నందికోలు ఆడిస్తూ గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో భాగంగా గంగిపూజ, గోపూజ, విష్ణు సహస్రనామ హోమాలు ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వాముల చేత గోపుర కలశ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేసి పూజలు నిర్వహించారు. రాత్రి భజన తదితర కార్యక్రమాలు జరిగాయి.

**శిలా తోరణం ప్రతిష్ఠ :** మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో శుక్రవారం బసవన్న ఆలయ నిర్మాణ పనులకు గాను శిలా ద్వారాల ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చెందిన రాజశేఖర్ స్వామీజీ కార్యక్రమానికి హాజరై శిలా ద్వారాల ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భక్తులంతా కలిసికట్టుగా ఉండి బసవన్న నూతన ఆలయ శిలా కట్టడ నిర్మాణం పనులను పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. వాల్మీకి కులపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజలు మెచ్చుకుంటే.. ప్రతిపక్షాలకు నచ్చదు

- సంక్షేమ పథకాలతో సంతోషంగా జనం
- ఓర్వలేకపోతున్న టీడీపీ
- జగనన్నకు లభిస్తున్న ఆదరణతో బాబుకు అక్కసు
- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి
- పెసలబండ, సుల్తానపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

**ఆదోని రూరల్ :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల మన్ననలు పొందుతుంటే ప్రతిపక్షం తట్టుకోలేకపోతోంది. నవరత్నాలతో జనం సంతోషంగా ఉండటాన్ని టీడీపీ జీర్ణించుకోలేకపోతోంది. ఒక పక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధితో సీఎం వైఎస్ జగన్‌కు లభిస్తున్న ఆదరణను చూసి చంద్రబాబు అక్కసుతో పచ్చమీడియాతో కలిసి పసలేని ఆరోపణలు చేస్తూ, జనాన్ని పక్కదారి పట్టించే కుట్రకు తెరతీశారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. తమ అభివృద్ధికి కృషి చేస్తున్న జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని, టీడీపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా జనం మరోసారి చీదరించుకోవడం ఖాయమన్నారు. శుక్రవారం మండలంలోని పెసలబండ, సుల్తానపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి అందుతున్న సంక్షేమ పథకాలపై స్థానికులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన, ప్రజల గుండెల్లో జగన్‌కు ఉన్న స్థానాన్ని పేద ప్రజలు బయటపెడుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. మూడున్నరేళ్ల పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా పాలన సాగిస్తున్నారని, మరింత కాలం అధికారంలో ఉంటే పేదల జీవన స్థాయి మారిపోతుందని, రాష్ట్రం దేశానికి దిక్సూచిలా మారుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇచ్చిన హామీల్లో 96శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ప్రస్తావించిన సమస్యలను అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పారదర్శక పాలన సాగిస్తూ పథకాల్లో భాగంగా కేటాయించిన లబ్ధి మొత్తం లబ్ధిదారులకు దక్కేలా నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, ఆర్‌ఐ జయరామిరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, నాయకులు, నాయకురాళ్లు శ్రీలక్ష్మి, కల్పవల్లి, సర్పంచ్‌లు వీరేష్, నరసింహులు, శివారెడ్డి, వీరభద్రగౌడ్, మాజీ సర్పంచ్ నరసింహులు, రాముడు, విరుపాక్షి, ఎంపీటీసీ చక్రవర్తి, మాజీ ఎంపీటీసీ రామన్నగౌడ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పెసలబండలో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

### 8 నుంచి గాయత్రీ మాత మహోత్సవాలు

**ఆస్పరి:** ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయిత్రీ మాత మహోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రూపామోహన్‌శర్మ శుక్రవారం తెలిపారు. ఆలయంలో 8వ తేదీన గంగ, గోవు, ఆకు పూజ, కంకణాధరణ, కుంకుమార్చన, 9న అభిషేకాలు, కుంకుమార్చన, మహా మంగళహారతి, పల్లకీ సేవ, 10న అభిషేకాలు, కలశ పూజ, గాయత్రీ యజ్ఞం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

**రాష్ట్ర స్థాయి భజన పోటీలు**

గాయత్రీ మాత మహోత్సవాల సందర్భంగా ఈనెల 10వ తేదీన రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రూపామోహన్ శర్మ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10,116, తరువాతి స్థానాలకు వరుసగా రూ.8,116, రూ.6,116, రూ.4,116, రూ.2,116, రూ.1,516, రూ.1,116, ఎనిమిదో స్థానం వారికి గోడ గడియారం అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 94913 43707 నంబర్‌ను సంప్రదించాలన్నారు.